క్లుప్తంగా

పరిశీలన..



ఏర్పాట్లపై ప్రిన్సిపాల్ సంధ్యతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు శామ్యూల్, ఆర్‌జేడీ జ్యోతికుమారి

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఏఎంఓ, రాష్ట్ర పరిశీలకుడు ఎంఆర్‌పి శామ్యూల్, ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమార్ పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల సంధ్య మాట్లాడుతూ, ఈ నెల 19వ తేదీ నాటికి ప్రవేశాలు పూర్తి చేసి, 21 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.

సీపీఎం నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భోగాపురం: బీజేపీ కేంద్రమంత్రి అమిత్ షా విశాఖపట్నానికి రావడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని ముక్కాం జంక్షన్ వద్ద సీపీఎం నాయకులు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలవుతున్నా నేటి వరకు మన రాష్ట్రానికి ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, విశాఖపట్నానికి రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు చేయలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడమే కాకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాబోయే కాలంలో బీజేపీకి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రవి, రమణ, దాసు, రామసూరి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిక్షణను ప్రారంభిస్తున్న భిక్షమయ్య

గజపతినగరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తాయని సత్యసాయి ధ్యానమండలి గురువు భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యోగా శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి ధ్యానమండలిని ప్రారంభించి 25 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా యోగా, ధ్యానంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు కల్పించనున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గజపతినగరం యోగా శిక్షకులు శీర వాసు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యవర్గ కార్యదర్శి దొగ్గదేవుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 50 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నామని ఏఓ పి.వి.మల్లికార్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పిల్లిపెసర, కట్టి జనుము, జీలుగు విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. వీటి సాగు వల్ల భూసారం పెరుగుతుందని, ఖరీఫ్ ప్రధాన పంటల సాగుకు ముందు వీటిని చల్లి చేను పెరిగాక కలియదున్నాలని సూచించారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

గంట్యాడ: సిరిపురం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం ప్రారంభించనున్నారని ఎంపీపీ పీరుబండి హైమావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రారంభోత్సవం నేడు

మెరకముడిదాం: మండల కేంద్రంలో నిర్మించిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు శివాలయం ధర్మకర్త కుచ్చర్లపాటి గుర్రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచే పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా అభివృద్ధి..



తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

- అభివృద్ధిపథంలో చంద్రబాబు కాలనీ
- ఇప్పటికే రూ. 5.5 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం
- రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి టెండరు ఖరారు
- ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు ట్యాంక్ నిర్మాణం

నెల్లిమర్ల: అది పేరుకు చంద్రబాబు నాయుడు కాలనీ..అయితే టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్ల కాలంలో ఏ చిన్న అభివృద్ధి పని కూడా ఆ కాలనీలో చేపట్టలేదు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ కాలనీవాసులు ఎన్నోసార్లు విన్నవించారు. అయినా ఆ పార్టీ పెద్దలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలనీ అభివృద్ధికి పెద్దపీట వేసింది. కాలనీ ప్రధానవీధిలో సీసీ రోడ్డు, కాలువ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసింది. అలాగే ఇంటింటికీ కుళాయి మంజూరు చేయడానికి అవసరమైన తాగునీటి ట్యాంక్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తోంది. వివరాల్లోకి వెళితే..

నెల్లిమర్ల పట్టణంలోని మిమ్స్ సమీపంలో సుమారు ఆరున్నర ఎకరాల్లో చంద్రబాబు కాలనీ ఉంది. సుమారు 150 కుటుంబాలు ఇక్కడ నివశిస్తున్నాయి. చంద్రబాబు సీఎంగా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏర్పడిన కాలనీలో ఇప్పటివరకు చిన్న అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. 14 ఏళ్ల టీడీపీ హయాంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నారు. ఒకానొక సమయంలో కాలనీ మహిళలు తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటుకు రోడ్డెక్కారు. అయినా ఆ పార్టీ పెద్దలు స్పందించలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కాలనీలో మౌలిక సౌకర్యాలపై దృష్టి సారించింది. 9వ వార్డు కౌన్సిలర్ బూర సుజాత ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు ప్రతి వీధిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధిలైట్ల సౌకర్యం కల్పించారు. అలాగే తాత్కాలికంగా బోరు ఏర్పాటు చేసి కాలనీవాసులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీలో రూ. 5.5 లక్షలతో ఇప్పటికే సీసీ కాలువలు నిర్మించారు. అలాగే రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్ కూడా ఖరారైంది. త్వరలోనే వర్క్ ఆర్డర్ ఇచ్చి పనులు ప్రారంభించనున్నారు. ఇదిలా ఉంటే పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయడానికి ఏఐఐబీ నిధులతో పథకాలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా కాలనీలోని ప్రతి ఇంటికీ కుళాయిలు మంజూరు చేయడానికి అవసరమైన చర్యలను అధికారులు చేపడుతున్నారు. దీని కోసం కాలనీలోనే ప్రత్యేకంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ట్యాంక్ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి..



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సహకారంతో చంద్రబాబు కాలనీలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించి, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. కాలనీ ప్రధానవీధిలో ఇప్పటికే రూ. 5.5 లక్షలతో సీసీ కాలువలు నిర్మించాం. త్వరలోనే మరో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు కూడా నిర్మిస్తాం. దీనికి సంబంధించిన టెండర్ ఖరారైంది. అలాగే ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాం. దీని కోసం ఏఐఐబీ నిధులతో ఇక్కడే ట్యాంక్ నిర్మిస్తున్నాం. నిర్మాణ పనులు ప్రస్తుతం జోరుగా జరుగుతున్నాయి.

– బూర సుజాత, 9వ వార్డు కౌన్సిలర్, నెల్లిమర్ల

అంబేడ్కర్ విగ్రహాలతో రాజకీయం తగదు



ఆందోళన చేస్తున్న కొట్యాడ ఎస్సీ కాలనీ వాసులు

లక్కవరపుకోట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలతో రాజకీయాలు చేయడం తగదని కొట్యాడ గ్రామ ఎస్సీ కాలనీ వాసులు హితవు పలికారు. గ్రామంలో సర్వే నంబర్ 218/1లో సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని బల్క్‌మిల్క్ కేంద్రం, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఇటీవల ఈ భూమిలో రెవిన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. పక్క గ్రామాలకు చెందిన కొంత మంది ఈ భూమిలో దళితుల సహాయంతో శనివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేశారు. ఆదివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న కొట్యాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎం.అప్పారావు, వార్డు మెంబర్ తలారి దేవి, మద్దిల తాతబాబు, మద్దిల నాగరాజు తదితర దళిత నాయకులు, మహిళలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడని ఆయన పేరు, విగ్రహాలతో రాజకీయం చేయవద్దని స్పష్టం చేశారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం, భవనం ఏర్పాటుకు, గ్రామ పెద్దలు ఎస్సీ కాలనీ సమీపంలో స్థలం కూడా చూపించారని, అక్కడే తాము వాటిని నిర్మించుకుంటామన్నారు.అంతేకాని గ్రామాభివృద్ధికి కేటాయించిన స్థలాల్లో రాత్రికి రాత్రి విగ్రహాలు ఏర్పాటు చేసి రాజకీయం చేయడం సరికాదని, ఇటువంటి చర్యలకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 218/1 స్థలం సమీపంలో ఇప్పటికే పలు ప్రభుత్వ భవనాలను నిర్మించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆశయాలను తుంగలో తొక్కి గ్రామస్తుల మధ్య చిచ్చు పెట్టడం తగదన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుకు అనుమతులు తీసుకోలేదని, పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నేడు విద్యాకానుక పంపిణీ

మెరకముడిదాం: గర్భాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేయనున్నారని ఎంఈఓ రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, పీఎంసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఇద్దరు హెచ్‌ఎంలకు బదిలీ

బొండపల్లి: మండలంలోని ఇద్దరు హైస్కూల్ హెచ్‌ఎంలకు బదిలీ అయిందని ఎంఈఓ ఎం.బూసినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బొండపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.సన్యాసిరాజుకు రాచకిండాం హైస్కూల్‌కు బదిలీ అయింది. ఇక్కడికి మెంటాడ మండలం తమ్మిరాజుపేట హైస్కూల్‌లో పని చేసిన ఉమామహేశ్వరరావు రానున్నారు. రాచకిండాం పాఠశాల హెచ్‌ఎం అప్పన్నకు విజయనగరం బదిలీ అయ్యింది.

'స్పందన'ను వినియోగించుకోండి

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 'స్పందన'కు అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పూసపాటిరేగ, కుమిలి గ్రంథాలయ అధికారులు పువ్వల నాగేశ్వరరావు, శీరపు ఇందుమతి అన్నారు. మండలంలోని పూసపాటిరేగ, కుమిలి గ్రంథాలయాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. గ్రంథాలయాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి విద్యార్థీ సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మామిడి అప్పయ్యమ్మ, బొంపల సీతారాం, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి..

నెల్లిమర్ల: గ్రంథాలయాలను విద్యార్థులంతా వినియోగించుకోవాలని నెల్లిమర్ల నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో భాగంగా సమ్మర్ క్యాంపునకు విచ్చేసిన విద్యార్థులకు అట్టలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యం గ్రంథాలయాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు..

డెంకాడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.మహేష్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రేచర్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గాజులరేగ గ్రంథాలయంలో..

విజయనగరం అర్బన్: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గాజులరేగ గ్రంథాలయ శాఖలో నెల రోజుల పాటు నిర్వహించిన తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యాసరచన, పద్యాలు, చిత్రలేఖనం, వివిధ కళా, క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. శిక్షణ అందించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొని అనేక విషయాలను తెలుసుకున్నారన్నారు. శాఖ గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామానాయుడు, నారాయణరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సభ నిర్వహించారు. నెల రోజుల పాటు విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చిత్రలేఖనం, కంప్యూటర్ శిక్షణ, పేపర్ క్రాఫ్ట్స్, సంగీతం, డ్యాన్స్, లెక్కలు చేయడం, ఆటపాటలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు సభ రోజున ఆయా అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి బహుమతులు అందజేశారు. 33 రోజుల పాటు శిక్షణ అందించిన సాహితీవేత్తలు, శిక్షకులు పీఎం సుబ్బారావు, జీఎస్ చలం, పి.సన్యాసిరావు, బాషా, భాస్కర్, తదితరులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తొలిత విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న గ్రంథాలయ అధికారులు



నెల్లిమర్ల: విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్‌పర్సన్, ఎంఈఓ



డెంకాడ: ప్రతిభ కనబరిచన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ మహేష్, తదితరులు



విజయనగరం అర్బన్: ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ



విజయనగరం అర్బన్: సాహితీవేత్తలను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, తదితరులు



విజయనగరం అర్బన్: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

సంక్షేమ పాలనకు మద్దతివ్వండి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా మద్దతివ్వాలని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని 26, 27 డివిజన్‌ల పరిధిలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని జొన్నగుడ్డి రామమందిరం నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సమయంలో స్థానిక మహిళలు కోలగట్లకు తిలకం దిద్ది, హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవర్ల కుమారస్వామి, స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ, ప్రభుత్వ పాలన పట్ల ప్రజాస్పందన ఏవిధంగా ఉందో తెలుసుకునేందుకు .. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును పరిశీలించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, జోనల్ ఇన్‌చార్జి సంగంరెడ్డి బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, దుప్పాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లోనే ఉపాధి, సేవలు



వలంటీర్లు(ఫైల్)

నియోజకవర్గంలోని గ్రామవలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల వివరాలు				
మండలం	పంచాయతీలు	వలంటీర్లు	సచివాలయాలు	ఉద్యోగులు
చీపురుపల్లి	19	337	18	145
గరివిడి	30	426	23	231
మెరకముడిదాం	29	318	18	171
గుర్ల	42	384	24	208

- వైఎస్సార్‌సీపీ సర్కారులో యువతకు దక్కిన ఉపాధి
- వలంటీర్, సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే ఉద్యోగాలు
- నియోజకవర్గంలో సేవలందిస్తున్న 1,465 మంది వలంటీర్లు
- 755 మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు
- గ్రామాల్లోనే ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు

చీపురుపల్లి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సాకారం చేశారు. ఈ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలన్నీ అందుతుండడమే కాకుండా వేలాది మంది యువతకు పల్లెల్లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. నిరుద్యోగ యువతకు ఎలాంటి పైరవీలు, దళారీ వ్యవస్థతో పని లేకుండా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష పైచిలుకు మందికి ప్రతిభ ఆధారంగా ఉన్న ఊరిగా దగ్గరలోనే సచివాలయాల్లో ప్రభుత్వ కొలువులు దక్కించుకునే అవకాశాన్ని కల్పించారు. గ్రామ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లో 50 ఇళ్లకు ఒకరిని వలంటీర్‌ను నియమించి ఆయాభై కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు అందేలా చూసుకునే బాధ్యతలను వారికి అప్పగించారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 120 గ్రామ పంచాయతీల్లో 1,465 మంది నిరుద్యోగ యువతను వలంటీర్లుగా ప్రభుత్వం నియమించింది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే వీరి పనిగా ప్రభుత్వం నిర్దేశించింది. వీరి సేవలకు ప్రభుత్వం గౌరవ వేతనాన్ని అందజేస్తోంది. ఉత్తమ వలంటీర్లకు ఏటా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరుతో సత్కరిస్తూ నగదు పురస్కారాలు, ధృవీకరణ పత్రాన్ని అందజేస్తోంది. ఇక వీరితో పాటు సచివాలయ వ్యవస్థలో భాగంగా నియోజకవర్గంలోని 83 సచివాలయాల్లో 755 మంది యువతకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే ప్రజలకు అందుతున్నాయి. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పింది.

యువతకు చక్కని ఉపాధి

నిరుద్యోగ యువతకు ఉన్న ఊరిలోనే చక్కని ఉపాధి అవకాశాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతీ గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. వారంతా గ్రామాల్లో ప్రభుత్వ ప్రతినిధులుగా ఉంటూ పథకాలను పేదలకు అందిస్తుంటారు. ప్రతి గ్రామ సచివాలయంలోనూ పది మందికి పైగా యువత ప్రభుత్వ కొలువుల్లో పని చేస్తున్నారు.

– కె.రామకృష్ణరాజు, ఎంపీడీఓ, చీపురుపల్లి.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

తాము నివసిస్తున్న ప్రాంతంలోనే ఉంటూ ప్రభుత్వ పథకాల పర్యవేక్షణతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యతలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు అప్పగించినందుకు కృతజ్ఞతలు. తమ పరిధిలోని యాభై కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉంటూ పథకాలు అందించడం ఎంతో గర్వకారణంగా ఉంది. తాము అందించే సేవలకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు ఏటా పురస్కారాలు కూడా అందిస్తుండడం సంతోషంగా ఉంది. ఈ ఏడాది నాకు సేవా రత్న పురస్కారం లభించింది.

– రేగిడి దుర్గ, వలంటీర్, చీపురుపల్లి.